సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 8 । సెప్టెంబర్ । 2023



పథకం ప్రకారమే హత్య

మనస్పర్థల కారణంగా నెలకొన్న గొడవలతో పథకం ప్రకారమే యువకుడిని దారుణంగా హత్య చేశారు.

8లో ▸



వారికే కొమ్ముకాస్తున్నారు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో పేదలు బతకలేని స్థితిలో ఉన్నారని సీపీఎం నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

8లో ▸



ఇక పనులు చకచకా..

'పట్నం'లో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ డివిజన్, క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నారు.

8లో ▸



మంచాల: వేడుకల్లో భాగంగా ఆరుట్లలోని ఓ పాఠశాలలో ఉట్టికొడుతున్న చిన్నారులు

శ్రీకృష్ణ వైభవం

కృష్ణాష్టమి వేడుకలను గురువారం జిల్లావాసులు ఘనంగా జరుపుకొన్నారు. ఆలయాల్లో వేకువ జామునుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నికృష్ణుడు, గోపిక వేషధారణలో తమ చిన్నారులను చూసుకుని తల్లిదండ్రులు మురిసిపోయారు. పలుచోట్ల చిన్నాపెద్దా తేడా లేకుండా ఉత్సాహంగా ఉట్లు కొట్టారు.



మహేశ్వరం: పోచమ్మ బోనాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

బోనం.. ఘనం

'అమ్మా బైలెల్లినాదో.. నాయన తల్లీ బైలెల్లినాదో' అంటూ భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. గురువారం ఆయా గ్రామాల్లో బోనాల వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బోనాలతో ఊరేగింపు అమ్మవారి ఆలయాలకు వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎక్కడ చూసినా సందడి వాతావరణం కనిపించింది.



కడ్తాల్: ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

'హస్తం'.. జోడో సంబరం

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో పాదయాత్ర ఏడాది పూర్తయిన సందర్భంగా టీపీసీసీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం ఆ పార్టీ నాయకులు భారీ ర్యాలీలు నిర్వహించారు. కార్యకర్తలు నినాదాలతో హోరెత్తించారు. పార్టీ జెండాలు చేతపట్టుకుని ఉత్సాహంగా ముందుకు సాగారు.

కూలిన బతుకులు

నిర్మాణంలో ఉన్న పిట్టగోడ కూలి ముగ్గురి మృతి

- మరో ముగ్గురు కార్మికులకు తీవ్ర గాయాలు
- అనుమతులకు మించి అదనంగా ఫ్లోర్ నిర్మాణం
- నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో తప్పిన పెను ప్రమాదం



రోడ్డుపై పడిపోయిన కార్మికుల మృతదేహాలు, పిట్టగోడ పెళ్లలు





మృతులు సానియా చలాన్, సామ బట్నాయక్, సానియా బట్నాయక్



గాయపడిన కార్మికుడు ముదాబత్ నాయక్ | ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బలరాం

భాగ్యనగర్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ అడ్డగుట్ట సొసైటీలోని ఓ భవన నిర్మాణం ఎలివేషన్ సెంట్రింగ్ పనులు చేస్తుండగా ఆరో అంతస్తుపై ఉన్న పిట్టగోడ కూలిపోయింది. దీంతో భవన నిర్మాణానికి ఏర్పాటు చేసిన గోవా కర్రలు విరిగిపోయాయి. ఈ ఘటనలో కర్రలపై నిల్చుని ప నిచేస్తున్న ముగ్గురు కార్మికులు మృతి చెందారు. మరో ముగ్గురు కార్మికులు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గురువారం ఉదయం 8.30 గంటలకు ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగుట్ట సొసైటీలోని ఓ భవన నిర్మాణం చేపడుతున్నారు. ఎలివేషన్ కోసం సెంట్రింగ్ పనుల్లో ఒడిశా రాష్ట్రానికి చెందిన ఆరుగురు కార్మికులు పనుల్లో నిమగ్నమయ్యారు. సెంట్రింగ్ తొలగిస్తున్న సమయంలో పిట్టగోడ కూలి సానియా బట్నాయక్ (19), సామ బట్నాయక్ (23), సానియా చలాన్ (20)లు మృతి చెందారు. వీరితో పాటు పని చేస్తున్న ముదాబత్ నాయక్, బలరాం, సుప్రా బట్నాయక్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సామ బట్నాయక్, సానియా చలాన్‌లు అక్కడికక్కడే మృతి చెందగా, సానియా బట్నాయక్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. భవనం పిట్టగోడ కూలిన విషయం తెలుసుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. జీహెచ్‌ఎంసీ, డీఆర్‌ఎఫ్ బృందాలతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో గురువారం పెద్దగా జనసంచారం లేకపోవడంతో పెను ప్రమాదమే తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. మృతదేహాలను పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ భవనం దాసరి సంతోష్, దాసరి సాయిరాం పేరుపై 2022 డిసెంబర్ 2వ తేదీన జీ+5 అంతస్తులకు అనుమతులు తీసుకున్నారు. అదనంగా మరో ఫ్లోర్ అక్రమ నిర్మాణం చేపట్టారు. ఆ అంతస్తులోనే పని చేస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది.

నాణ్యత లేకపోవడంతోనే..

ఆరో అంతస్తుపై పిట్టగోడ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవటంతోనే ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గోడలు, గోవా కర్రలు తడిచిపోయాయి. పిట్టగోడ కోసం నిర్మించిన సిమెంట్ పెళ్లలు గోవా కర్రలపై పడిపోగా అవి విరిగి వాటిపై నిల్చుని పని చేస్తున్న కార్మికులు కింద పడిపోయారు. అనుమతులు పొందిన దానికంటే అక్రమంగా అంతస్తులు నిర్మాణం చేపట్టడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. ముందుగానే అక్రమ అంతస్తులను అధికారులు అడ్డుకొని ఉంటే ముగ్గురి ప్రాణాలు గాలిలో కలిసేవి కావంటున్నారు.

క్రిమినల్ కేసులు పెడతాం

ఈ ఘటనపై జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి డిప్యూటీ కమిషనర్ హరికృష్ణ స్పందించారు. ఈ ఘటనలో ముగ్గురి కార్మికుల మృతికి కారణమైన భవన యజమానులు, ఆర్కిటెక్ట్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. అనుమతులు పొందిన దానికంటే అక్రమంగా నిర్మించిన మరో ఫ్లోర్ నిర్మాణాన్ని పూర్తిగా కూల్చివేస్తామని పేర్కొన్నారు. గతంలోనే రెండుసార్లు భవన యజమానికి జీహెచ్‌ఎంసీ అధికారులు నోటీసులు జారీ చేశామని తెలిపారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే గాంధీ..

ప్రమాదవశాత్తు పిట్టగోడ కూలి ముగ్గురు కార్మికులు మృతి చెందడం, ముగ్గురు కార్మికులకు గాయాలు కావటం దురదృష్టకరమని స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. భవన యజమాని, బిల్డర్, సంబంధిత అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిజేస్తామని హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో ఇటువంటి ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటామని, ప్రమాదానికి బాధ్యులైన వారిపై చర్యలు తప్పవని ఆయన చెప్పారు.

జోరుగా బోగస్!



ఎన్నికల్లో గెలిచేందుకు కుయుక్తులు

- కొత్త ఓటర్ల నమోదులో అడ్డదారులు
- కొన్ని నియోజకవర్గాల్లో వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు
- తల పట్టుకుంటున్న ఎన్నికల అధికారులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఎన్నికల గడువు సమీపిస్తుండటంతో ఓటు బ్యాంకుపై అన్ని పార్టీల అభ్యర్థులు దృష్టి సారించారు. ఎలాగైనా ఎన్నికల్లో గెలిచి తీరాలని భావిస్తున్న నేతలు కొత్త ఓటర్ల నమోదులో అడ్డదారులు తొక్కుతున్నట్లు సమాచారం. తమకు అనుకూలంగా ఓటు వేసే వారిని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలకు తరలించి, వారి పేర్లు జాబితాలో చేర్పిస్తున్నట్లు తెలిసింది. మహేశ్వరం, రాజేంద్రనగర్ నియోజకవర్గాల్లో ఈ బోగస్ ఓటర్ల నమోదు జోరుగా సాగుతున్నట్లు సమాచారం. ఇదే అంశంపై ప్రతిపక్ష పార్టీల నేతలు ఎన్నికల కమిషన్‌కు సైతం ఫిర్యాదులు చేయడం గమనార్హం. బోగస్ ఓటర్ల ఏరివేతపై ఏం చేయాలో అర్థం కాక అధికారులు తల పట్టుకుంటున్నారు.

మహేశ్వరంలో..

నియోజకవర్గం పరిధిలో మొత్తం 511 పోలింగ్ బూతులు ఉండగా, వీటి పరిధిలో 2,54,089 మంది పురుషులు, 2,38,017 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వీరితో పాటు మరో 62 మంది థర్డ్‌జెండర్లు, 58 మంది ఎన్‌ఆర్‌ఐలు, 52 మంది సర్వీసు ఓటర్లు ఉన్నట్లు అంచనా. జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోనే బోగస్ ఓట్లు ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది. షాహీన్‌నగర్ పోలింగ్ బూత్ నంబర్ 378 పరిధిలోని ఒకే ఇంటి అడ్రస్‌తో 334 ఓట్లు నమోదవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. కొత్తపేట పోలింగ్ బూత్‌నంబర్లు 300, 304 పరిధిలో కేవలం రెండు అడ్రస్‌లపైనే 307 ఓట్లు నమోదైనట్లు సమాచారం. ఇక షాహీన్‌నగర్, బిస్మిల్లాకాలనీ, ఎర్రకుంట పరిధిలోని 375, 376, 357,368,365,306 పోలింగ్ బూత్ నంబర్లలో ఆరు ఇంటి నంబర్లపై 735 ఓట్లు నమోదైనట్లు తెలిసింది. దీనిపై బీజేపీ నేతలు ఇటీవల కందుకూరు ఆర్డీఓకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ ఓట్ల తొలగింపు విషయంలో ఎన్నికల కమిషన్ అధికారులు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నట్లు వినికిడి.

రాజేంద్రనగర్‌లో..

నియోజకవర్గంలో 535 పోలింగ్ బూతులు ఉండగా, వీటి పరిధిలో 2,71,909 మంది పురుషులు, 2,47,858 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వీరితో పాటు మరో 32 మంది థర్డ్‌జెండర్లు, 76 మంది ఎన్‌ఆర్‌ఐలు, 74 మంది సర్వీసు ఓటర్లు ఉన్నట్లు అంచనా. వీటిలో ముఖ్యంగా శాస్త్రీపురం, ఉప్పర్‌పల్లిలోని గోల్డెన్‌హైట్స్, హసన్‌నగర్, ఎంఎం పహాడి, సులేమాన్‌నగర్, వట్టేపల్లి తదితర ప్రాంతాల్లో బోగస్ ఓట్లు భారీగా నమోదైనట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒకే ఇంటి నంబర్‌తో పదుల సంఖ్యలో ఓట్లు నమోదైనా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి బోగస్ ఓట్లను తొలగించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. మరోవైపు ఒకే ఇంటి అడ్రస్‌తో ఉన్న భార్యాభర్తలు ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేయించుకోగా, భార్యకు ఒక పోలింగ్ బూతు, భర్తకు మరో పోలింగ్ బూతు కేటాయించడం విశేషం. ఎన్నికల రోజు దంపతులిద్దరూ కలిసి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోలేని పరిస్థితి. పోలింగ్ బూతుల ఎంపిక సైతం క్రమపద్ధతిలో లేదని బీజేపీ నేతలు ఇటీవల ఆర్డీఓకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు స్పందించింది లేదు.

ఇతర నియోజకవర్గాల్లో..

ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం, శేరిలింగంపల్లి నియోజకవర్గాల్లో ఓటరు కార్డుకు ఆధార్ లింక్ చేయకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన వారు రెండు చోట్ల ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఇక కల్వకుర్తి, చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో కొత్తగా ఓటు హక్కును నమోదు చేసుకుంటున్న యువతకు ఓటరు కార్డు జారీ కాకుండా జాప్యం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఓటు హక్కు కోసం సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో 18 ఏళ్లు నిండిన వారు దరఖాస్తు చేసుకున్నా.. జాబితాలో నమోదు చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలో 3,369 పోలింగ్ బూత్‌లు ఉండగా, వీటి పరిధిలో మొత్తం 31,99,674 మంది ఓటర్లు ఉన్నట్లు ఇటీవల ముసాయిదా జాబితాలో ప్రకటించింది. వీరిలో 16,62,692 మంది పురుషులు, 15,35,537 మంది మహిళా ఓటర్లు, 384 మంది ట్రాన్స్‌జెండర్స్ ఉన్నారు. వీరితో పాటు ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు 195 మంది ఉండగా, సర్వీసు ఓటర్లు మరో 866 మంది ఉన్నారు. కొత్త ఓటర్ల నమోదుకు ఇంకా అవకాశం ఉండటంతో ఓట్ల నమోదు శాతం పెరిగే అవకాశం ఉంటుందని రాజకీయ పండితులు అభిప్రాయపడుతున్నారు.

న్యూస్‌రీల్

ఇన్నర్ పీస్ మ్యూజియం భేష్

డీజీపీ అంజనీకుమార్



ఆర్ట్ ట్రీట్ ప్రదర్శనలో డీజీపీ అంజనీ కుమార్ తదితరులు

షాద్‌నగర్: మంచి ఆలోచనలతో అద్భుతమైన కళాకండాలను రూపొందించవచ్చని డీజీపీ అంజనీకుమార్ అన్నారు. నందిగామ మండలంలోని కన్హా శాంతి వనం ఇన్నర్‌పీస్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన ఆర్ట్ రీట్రీట్ ప్రదర్శనను గురువారం ఆయన సందర్శించారు. గత నెల 29న ప్రారంభమైన ఈ కార్యక్రమంలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 30 మంది కళాకారులు పాల్గొని సుందరమైన చిత్రాలను గీశారు. శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు, పద్మభూషణ్ పురస్కార్ అవార్డు గ్రహీత దాజీతో కలిసి డీజీపీ కళారూపాలను వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సృజనాత్మకమైన ఆలోచనలు రావడం అంత సులువు కాదన్నారు. మంచి ఆలోచనలతో గీసిన చిత్రాలు అందరినీ ఆకట్టుకుంటాయని, ఆలోచింపజేస్తాయని తెలిపారు. ఇన్నర్‌పీస్ మ్యూజియం బాగుందని కితాబిచ్చారు. రామచంద్ర మిషన్ అధ్యక్షుడు దాజీ మాట్లాడుతూ.. కళ అనేది దైవంతో అనుసంధానించడానికి ఒక మార్గమని తెలిపారు.

సేవాగుణం అలవర్చుకోవాలి



విద్యార్థినికి చెక్కు అందిస్తున్న రఘునందన్‌రావు తదితరులు

చేవెళ్ల: సంపాదించిన దాంట్లో కొంతైనా పేదలకు దానం చేసే సేవాగుణం ప్రతి ఒక్కరిలో ఉండాలని రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి, ఐఏఎస్ అధికారి రఘునందన్‌రావు అన్నారు. మండలంలోని కమ్మెట సమీపంలో నిర్మించిన విహార సురవి ప్రాజెక్టులో గురువారం విహార సురవి ప్రాజెక్టు, హర్షఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు కోసం పనిచేసిన 15 కూలీ కుటుంబాలకు రూ.లక్ష చొప్పున.. పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద వారికి కొంతైనా వెచ్చించడం అనేది గొప్ప నిర్ణయమన్నారు. కార్యక్రమంలో పర్యావరణవేత్త, ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి, ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ వెంకట్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ 'పట్నం' అభ్యర్థిగా అవకాశం ఇవ్వండి



దరఖాస్తు చేసుకుంటున్న పుప్పల శాంతికుమార్

ఇబ్రహీంపట్నం: బీజేపీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు తనకు అవకాశం ఇవ్వాలని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పుప్పల శాంతికుమార్ గురువారం దరఖాస్తు చేసుకున్నాడు. యాచారం మండలం ధర్మన్నగూడకు చెందిన ఆయన ఏబీవీపీ, తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ సెక్రటరీ రాహుల్ కశ్యప్

కందుకూరు: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ సెక్రటరీ రాహుల్ కశ్యప్ సూచించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దత్తత తీసుకున్న మండల పరిధిలోని గుమ్మడవెల్లిలో అమలవుతున్న సంసద్ ఆవాస్ గ్రామీణ యోజన పథకం పనితీరును పర్యవేక్షించడానికి గురువారం సాయంత్రం ఆయన రాష్ట్ర, జిల్లా అధికారుల బృందంతో కలిసి గ్రామంలో పర్యటించారు. మహిళా సంఘాల ద్వారా ఇద్దరు మహిళలు రుణం తీసుకుని ఏర్పాటు చేసుకున్న రెండు దుకాణాలను ప్రారంభించారు. అనంతరం గ్రామస్తులతో పాటు మహిళా సంఘాలతో సమావేశమై స్వయం సాధికారత సాధించడానికి కావాల్సిన అవసరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వ చేయూతతో స్థానికంగా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని పది మందికి ఉపాధి కల్పించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ హనుమంతరావు, జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్, డీఆర్‌డీఓ ప్రభాకర్, డీపీఓ శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ గౌర ప్రభాకర్, ఎంపీపీ మంద జ్యోతి, ఎంపీడీఓ వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.



గుమ్మడవెల్లిలో గ్రామస్తులతో సమావేశమైన రాహుల్ కశ్యప్ తదితరులు

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

- మంత్రి సబితారెడ్డి

చేవెళ్ల: పల్లెప్రగతి లాంటి కార్యక్రమాలతో గ్రామాల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని, జాతీయ స్థాయిలో అవార్డులు రావడమే దీనికి నిదర్శనమని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని పలుగుట్ట గ్రామంలో రూ.12.6 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, శ్మశానవాటిక, డంపింగ్ యార్డు, గ్రంథాలయ భవనం, వాటర్ ట్యాంక్‌లు.. చేవెళ్లలో రూ.కోటితో విలేజ్ బీటీ రోడ్డు, ఆలూరు నుంచి న్యాలట వరకు రూ.4.50 కోట్లతో బీటీ రోడ్డు పనులకు గురువారం ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, ఎంపీపీ ఎం.విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ కె. శివప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ మిట్ట వెంకట రంగారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

మొయినాబాద్: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ-బాకారం రోడ్డు, మొయినాబాద్-మూర్తుజగూడ రోడ్డు, పెద్దమంగళారం-చందానగర్ రోడ్ల నిర్మాణానికి గురువారం ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ శ్రీకాంత్, వైస్ ఎంపీపీ మమత, జెడ్పీటీసీ మాజీసభ్యులు కొంపల్లి అనంతరెడ్డి, చంద్రలింగంగౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ రవూఫ్, బీఆర్‌ఎస్ జిల్లా సీనియర్ నాయకులు కొత్త నర్సింహారెడ్డి, జయవంత్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నరోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల: పలుగుట్ట గ్రామంలో పల్లె ప్రకృతివనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి, చిత్రంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

పారిశుద్ధ్యంలో కార్మికుల పాత్ర కీలకం

మొయినాబాద్‌రూరల్: పారిశుద్ధ్యంలో పంచాయతీ కార్మికుల పాత్ర కీలకమని మంత్రి సబితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ముర్తుజాగూడలో గురువారం పర్యటించిన ఆమె పంచాయతీ కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

బడా వ్యాపారులకు కొమ్ముకాస్తున్నారు



యాచారం: సాగర్‌రోడ్డుపై రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఎం శ్రేణులు

జిల్లావ్యాప్తంగా సీపీఎం శ్రేణుల నిరసన

యాచారం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో పేదలు బతకలేని స్థితిలో ఉన్నారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.మధుసూదన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యావసర ధరల పెరుగుదల, అసైన్డ్ భూములు లాక్కోవడం, ఉపాధి అవకాశాలు కల్పించకపోవడాన్ని నిరసిస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గురువారం యాచారం మండల కేంద్రంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు బడా వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలకు కొమ్ముకాస్తున్నాయన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఫార్మాసిటీకి భూసేకరణ పేరుతో బలవంతం చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కి తగిన గుణపాఠం చెప్పడానికి బాధిత రైతులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ, జిల్లా కమిటీ సభ్యులు అంజయ్య, మండల కార్యవర్గ సభ్యులు బ్రహ్మయ్య, జంగయ్య, చందునాయక్, పెద్దయ్య, బాషయ్య, జగన్ తదితరులు పాల్గొన్నారు.

మంచాలలో..

మంచాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును వ్యతిరేకిస్తూ మంచాల మండల కేంద్రంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పగుడాల యాదయ్య మాట్లాడుతూ.. నిత్యావసర సరుకుల ధరలను విపరీతంగా పెంచి పేదోడిపై భారం మోపుతున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వాలు తమ తీరు మార్చుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు రాజు, స్వామి, యాదగిరి, నర్సింహ, బాలరాజ్, శేషగిరి, వెంకన్న, సురేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు విఫలం..

ఇబ్రహీంపట్నం రూరల్: ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం ఇబ్రహీంపట్నం మండల కమిటీ సభ్యులు విగ్నేష్ మండిపడ్డారు. పెరిగిన ధరలను తగ్గించాలని సీపీఎం పార్టీ కప్పపహాడ్ గ్రామశాఖ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఎం శాఖ కార్యదర్శులు ప్రభుదాస్, భిక్షపతి, సురేష్, వార్డు సభ్యులు రాజశేఖర్, నాయకులు శివుడు, శంకరయ్య, మహంకాళీ, సంజీవ, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సామేల్ పిలుపునిచ్చారు. సీపీఎం కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఆ పార్టీ నేతలు గురువారం ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు నిరసన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సీహెచ్.జంగయ్య, ఎల్లేశ్, జగన్, గణేశ్, బుగ్గరాములు, నర్సింహ, పురుషోత్తం, స్వప్న, విజయమ్మ, వీరేష్ పాల్గొన్నారు.

ప్రజలే బుద్ధి చెబుతారు..

షాద్‌నగర్: హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు నిరసనగా గురువారం సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజు ఆధ్వర్యంలో షాద్‌నగర్ చౌరస్తాలో ఆ పార్టీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలకు బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. మణిపూర్‌లో దేశ ప్రజలపై అరాచకాలు జరుగుతున్నా ప్రధానమంత్రి ఎందుకు నోరుమెదపడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుర్మయ్య, చంద్రమౌళి, రాజశేఖర్, జంగయ్య, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేష్, కృష్ణయ్య, లలిత, రాధిక, సరిత, శ్వేత, శివ, వెంకటేష్, రాజు, పాండు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పథకం ప్రకారమే హత్య

వీడిన ప్రవీణ్ మృతి మిస్టరీ

- హత్యకు దారితీసిన వివాహేతర సంబంధం
- ఏడుగురు నిందితుల అరెస్టు, రిమాండ్
- వివరాలు వెల్లడించిన చేవెళ్ల ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న చేవెళ్ల ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి

షాబాద్: వివాహేతర సంబంధం ఓ హత్యకు దారితీసింది. మనస్పర్థల కారణంగా నెలకొన్న గొడవలతో పథకం ప్రకారమే యువకుడిని హత్య చేశారు. ఈ నెల 4న వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించిన కేసు వివరాలను గురువారం చేవెళ్ల ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మండల పరిధిలోని హైతాబాద్ చెరువులో ఈనెల 4న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పైకి తేలింది. ఈ విషయాన్ని స్థానికులు పోలీసులకు తెలియజేశారు. సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకున్న సీఐ యాదయ్యగౌడ్ చెరువులో నుంచి బాడీని బయటకు తీయించారు. మృతుడి వివరాలను ఆరా తీయగా.. సంకెపల్లిగూడకు చెందిన కుమ్మరి ప్రవీణ్(31) అనే వ్యక్తి.. ఈనెల 1న రాత్రి 9గంటలకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదని, కుటుంబ సభ్యులు అతని కోసం వెతుకున్నారని తెలిసింది. దీంతో గ్రామస్తులకు సమాచారం ఇవ్వగా.. అక్కడకు వెళ్లిన బాధిత కుటుంబ సభ్యులు మృతదేహం ప్రవీణ్‌దేనని గుర్తించారు. తల వైపు ఒక సంచి, కాళ్ల వైపు మరో సంచి కట్టి.. చున్నీతో చేతులను వెనక్కి కట్టేసి.. నడుముకు బండరాయి కట్టి చెరువులో పడేసిన ఆనవాళ్లు కనిపించాయి. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

విచారణలో నేరం అంగీకారం..

హతుడు ప్రవీణ్‌కు ఇదే గ్రామానికి చెందిన కుమ్మరి మమతతో వివాహేతర సంబంధం ఉందని పోలీసులు తెలుసుకున్నారు. ఈ దిశగా విచారణ చేపట్టి మమతతో పాటు ఆమె కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకుని కూపీ లాగగా తామే హత్య చేసినట్లు అంగీకరించారు. మమత భర్త సుధాకర్ గతేడాది జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆ తర్వాత ప్రవీణ్, మమత మధ్య పరిచయం, సాన్నిహిత్యం వివాహేతర సంబంధానికి దారితీసింది. దీంతో మృతుడు పదేపదే మమత ఇంటికి వెళ్లేవాడు.

మనస్పర్థలతో శత్రుత్వం

కొద్దిరోజులుగా మమత, ప్రవీణ్ మధ్య మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. ఈ వ్యవహారాలు గొడవల వరకూ వెళ్లాయి. దీంతో ఇరువురి మధ్య దూరం పెరిగింది. అయినప్పటికీ ప్రవీణ్ మాత్రం మొండిగా వారి ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో మమత అతనిపై శత్రుత్వం పెంచుకుంది. ప్రవీణ్‌తో తనకు ఇబ్బందులు తప్పేలా భావించి, ఎలాగైనా అతన్ని చంపేయాలని నిర్ణయించుకుంది.

ఆ రోజు జరిగింది ఇదీ..

ఈనెల 1న ప్రవీణ్‌కు ఫోన్ చేసిన మమత ఇంటికి రావాలని చెప్పింది. దీంతో అతడు వెళ్లి తాను ఎప్పటిలాగే మిద్దెపై ఉన్నానని, పైకి రావాలని కోరగా.. మా అత్త, మామ పడుకున్నారు.. ఇంట్లో ఎవరూ లేరు నువ్వే కిందికి రా.. అని సూచించింది. ఇది నమ్మిన మృతుడు ఇంట్లోకి వెళ్లగానే గడియ పెట్టింది. అప్పటికే మమతతో పాటు ఆమె అత్త, మామ, తల్లి, అన్న, మరో వ్యక్తి ఉన్నారు. ప్రవీణ్ చూసిన వారు అతనితో గొడవ పడ్డారు. హతుడు సైతం వీరితో గట్టిగానే వారించాడు. ఈ క్రమంలో అక్కడే ఉన్న రోకలితో వెనక నుంచి ప్రవీణ్ తలపై మమత బలంగా కొట్టింది. ఆమె అన్న కుమార్ సైతం కొట్టడంతో ప్రవీణ్ పెద్దగా అరుపులు చేశాడు. దీంతో అతడి నోటికి చున్నీ బిగించి.. తల, కాళ్లపై రోకలితో మోదారు. దీంతో స్పృహ తప్పిన ప్రవీణ్ రక్తస్రావమై, ఊపిరాడక చనిపోయాడు.

శవాన్ని మూటగట్టి..

ప్రవీణ్ మరణించాడని నిర్ధారించుకున్న మమత అన్న కుమార్, ఇతడి బావమర్ది మహేశ్ శవాన్ని సంచిలో పెట్టి మూటకట్టారు. స్కూటీపై బాడీ పెట్టుకుని హైతాబాద్ చెరువు ఒడ్డున దింపారు. ఇక్కడ మృతదేహానికి బండరాయిని కట్టి చెరువులో పడేశారు. అనంతరం ఇంటికి వచ్చి రక్తం అంటిన దుస్తులకు నిప్పు పెట్టి కాల్చేశారు. మృతుడి సెల్‌ఫోన్‌ను ధ్వంసం చేసి కాల్చేశారు. ఆ తర్వాత ఎవరి ఇంటికి వారు వెళ్లిపోయారు.

సీసీ ఫుటేజీల తొలగింపు

ప్రవీణ్ వచ్చిన విషయం సీసీ కెమెరాల్లో రికార్డు అయిందని గ్రహించిన మమత దామర్లపల్లికి చెందిన కమ్మరి వెంకటేశ్ అనే వ్యక్తిని ఇంటికి పిలిపించి.. సీసీ ఫుటేజీలన్నింటినీ తీసేయించింది. ఈ కేసులో నిందితులైన కుమ్మరి మమత, కృష్ణయ్య, చంద్రకళ, కుమార్, లక్ష్మి, మహేశ్, కమ్మరి వెంకటేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ వివరించారు. హత్యకు ఉపయోగించిన రోకలి, ఎలక్ట్రిక్ స్కూటీ, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో షాబాద్ సీఐ యాదయ్యగౌడ్, ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కొత్తూరు: తిమ్మాపూర్ శివారులోని ఉన్న ఓ రిసార్ట్‌లో పేకాట ఆడుడుతున్న తొమ్మిదిమందిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ శంకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓ రిసార్ట్‌లో పేకాట ఆడుతున్నట్లు అందిన పక్కా సమాచారం మేరకు పోలీసులు దాడిచేసి.. పేకాట ఆడుతున్న తొమ్మిదిమందితో పాటు రూ.1.54లక్షల నగదు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు.వీరిలో ఏఆర్‌ఎస్‌ఐ ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు: ఎస్‌ఐ



ఆమనగల్లు: వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఆమనగల్లు ఎస్‌ఐ బల్‌రాం సూచించారు. ఆమనగల్లు పోలీసుస్టేషన్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. లైసెన్స్ లేనివారికి వాహనాలు ఇస్తే సంబంధిత వాహన యజమానులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపరాదని, విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఇన్సూరెన్స్‌ను ప్రతి సంవత్సరం రెన్యువల్ చేయించుకోవాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడపరాదని, మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని సూచించారు.

నిర్మాణాలకు భారతి అల్ట్రాఫాస్ట్ సరైన ఎంపిక

భారతీ సిమెంట్ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ బద్రి



తాపీమేస్త్రీలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

హుడాకాంప్లెక్స్: సిమెంటు వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్.. అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను తెలంగాణలో విడుదల చేసిందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ బద్రి తెలిపారు. సరూర్‌నగర్‌లోని శ్రీ బాలాజీ ట్రేడర్స్‌లో గురువారం తాపీమేస్త్రీల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టెక్నికల్ ఇంజినీర్ బద్రి మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందని తెలియజేశారు. అల్ట్రాఫాస్ట్‌తో ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపికని అన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని, స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని తెలిపారు. మార్కెట్లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ బలం చాలా అధికంగా ఉంటుందని తెలిపారు. డీలర్స్, తాపీమేస్త్రీలు పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాలను పాటించండి

'గణేశ్' నిమజ్జన నిర్వాహకులకు కొత్వాల్ సూచన



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ

సాక్షి, సిటీబ్యూరో: గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి సంబంధించి గతంలో న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఉత్సవాల నిర్వాహకులకు సూచించారు. ఈ నెల 18న గణేశ్ ఉత్సవాలు ప్రారంభం కానుండటం.. 28న సామూహిక నిమజ్జనం జరగనుండటంతో నగర పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. వీటిలో భాగంగా ఆనంద్ గురువారం మూడు కమిషనరేట్లతో పాటు ఇతర విభాగాలు, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ కమిటీ, ఖైరతాబాద్ గణేశ్ సమితి ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. గత ఏడాది ఏర్పాటు చేసిన వాటిలో పది అడుగుల కంటే ఎక్కువ ఎత్తున్న 15 వేల విగ్రహాలు పోలీసు రికార్డుల్లోకి ఎక్కకపోవడంతో తమ దృష్టికి రాలేదని కొత్వాల్ అన్నారు. మండపాల రిజిస్ట్రేషన్‌కు ఆన్‌లైన్ సదుపాయం కూడా ఉందని, నిర్ణీత ఎత్తుకు మించిన విగ్రహాలు ఏర్పాటు చేసే వాళ్లు దీన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఫలితంగా భద్రత, నిమజ్జనం ఏర్పాట్లు పక్కాగా చేయడానికి సాధ్యమవుతుందని ఆనంద్ తెలిపారు. రహదారులపై ఉన్న గోతులు, ఎగుడుదిగుడుగా ఉన్న పాట్‌హోల్స్ సమస్యలు తీర్చడంతో పాటు నిమజ్జనానికి అవసరమైన స్థాయిలో వాహనాలు, ట్రాలీలు సమకూర్చాలని నిర్వాహకులు పోలీసులకు కోరారు. చెట్టు కొమ్మల నరికివేత వంటి చర్యలు తీసుకుంటున్నట్లు జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. ఈ సమావేశంలో సైబరాబాద్, రాచకొండ కమిషనర్లు ఎం.స్టీఫెన్ రవీంద్ర, డీఎస్ చౌహాన్‌లతో పాటు రవాణా, విద్యుత్, ఎంఎంటీఎస్, మెట్రో రైల్, అగ్నిమాపక సహా వివిధ శాఖల అధికారులు పాల్గొని తాము తీసుకుంటున్న చర్యల్ని వివరించారు.

ఇక పనులు చకచకా..

- ఇబ్రహీంపట్నంలో పీఆర్ ఇంజనీరింగ్, క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్ కార్యాలయాలు
- 10న మంత్రి సబితారెడ్డి చేతులమీదుగా ప్రారంభోత్సవం
- ప్రజలు, అధికారులకు తీరునున్న దూరభారం



క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్ కార్యాలయం కోసం ముస్తాబవుతున్న భవనం

ఇబ్రహీంపట్నం: పరిపాలనా సౌలభ్యం కోసం ఇబ్రహీంపట్నంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ డివిజన్, క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇదివరకు పీఆర్ ఇంజనీరింగ్ డివిజన్ కార్యాలయం ఖైరాతబాద్‌లోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉండేది. ఆ విభాగాన్ని రెండు డివిజన్లు చేశారు. ఒక డివిజన్ ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేస్తుండగా మరో డివిజన్ యధావిధి స్థానంలో కొనసాగనుంది. స్థానిక డిప్యూటీ పీఆర్ ఇంజనీరింగ్ కార్యాలయ భవనంలో డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ భవనంలోని డిప్యూటీ పీఆర్ కార్యాలయాన్ని దాని వెనుకవైపు ఖాళీగా ఉన్న భవనంలోకి మార్చుతున్నారు. ఈ డివిజన్ పరిధిలో ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్, మహేశ్వరం, కందుకూర్, ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల్, మాడ్గుల్ మండలాలు వస్తాయి. ఈ కార్యాలయాల ఏర్పాటుతో పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో చేపట్టే రోడ్లు, భవనాల నిర్మాణాలకు సంబంధించిన పనులు త్వరితగతిన అయ్యేందుకు అవకాశం ఏర్పడుతుంది. ప్రజలకు దూరభారం కూడా తగ్గనుంది.

పీఆర్ క్వాలిటీ కంట్రోల్ సబ్‌డివిజన్ కార్యాలయం..

ఉప్పల్‌లో ఉన్న పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్ కార్యాలయం కూడా ఇక్కడికే తరలిరానుంది. ఈ కార్యాలయాన్ని స్థానిక డివిజన్ పీఆర్ ఇంజనీరింగ్ కార్యాలయ భవనం వెనుక ఉన్న మరో ఖాళీ భవనంలో ఏర్పాటు చేస్తున్నారు. ఇక పీఆర్ ఇంజనీరింగ్‌కు సంబంధించిన పనుల కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు, గుత్తేదారులు నగరానికి వెళ్లాల్సిన అవసరం తప్పనుంది.

10న ప్రారంభోత్సవాలు...

ఈనెల 10న మంత్రి సబితారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ చేతులమీదుగా ఈ కార్యాలయాలను ప్రారంభించనున్నారు. సమయం తక్కువగా ఉండటంతో ఈ మేరకు ఆయా భవనాల మరమ్మతులు, కలర్స్ వేసే పనులను ఆఘామేఘాల మీద చేపడుతున్నారు. ఆయా పనుల్లో సిబ్బంది నిమగ్నమయ్యారు. నిర్ణీత సమయంలోపు పనులు పూర్తిచేస్తామన్నారు.

నగరానికి వెళ్లాల్సిన అవసరం లేదు



పీఆర్ ఇంజనీరింగ్ డివిజన్, క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్ కార్యాలయాలు రెండూ కూడా ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు అవుతున్నాయి. డివిజన్ పరిధిలోని 10 మండలాలు ఈ కార్యాలయాల పరిధిలోకి వస్తాయి. 10వ తేదీ ఉదయం 10 గంటలకు మంత్రి సబితారెడ్డి ఈ కార్యాలయాలను ప్రారంభిస్తారు. ఇకనుంచి పీఆర్ ఇంజనీరింగ్ విభాగంలోని రోడ్లు, భవనాలకు సంబంధించిన పనుల కోసం నగరానికి వెళ్లాల్సిన అవసర ఉండదు.

– శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ పీఆర్ ఈఈ, ఇబ్రహీంపట్నం

'ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్'పై ఎన్‌ఐఏ కన్ను

- చైనా కేంద్రంగా సాగిన రూ.712 కోట్ల స్కామ్
- కొంత క్రిప్టో కరెన్సీ హిజ్బుల్లా వాలెట్‌లోకి బదిలీ
- ఈ ఏడాది జులైలో గుట్టురట్టు చేసిన సైబర్ కాప్స్
- టెర్రర్ ఫండింగ్ కోణంలోనూ దర్యాప్తు



సాక్షి, సిటీబ్యూరో: సోషల్ మీడియా యాప్స్ టెలిగ్రాం, వాట్సాప్ ద్వారా పార్ట్ టైమ్ జాబ్స్, వర్క్ ఫ్రమ్ హోమ్ అంటూ వచ్చే ప్రకటనలు ఇచ్చి, ఆకర్షితులైన వారికి లింకులు పంపి, ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో రూ.712 కోట్లు వసూలు చేసిన భారీ స్కామ్‌పై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) దృష్టి పెట్టింది. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల నుంచి కీలక సమాచారం సేకరించింది. చైనీయులు సూత్రధారులుగా ఉన్న ఈ సైబర్ నేరగాళ్లు కాజేసిన మొత్తం 3 వేల డాలర్ల విలువైన క్రిప్టో కరెన్సీ హిజ్బుల్లా వాలెట్‌లోకి వెళ్ళడంతో టెర్రర్ ఫండింగ్ కోణంలో ఎన్‌ఐఏ అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ కేసును తమ ఆధీనంలోకి తీసుకుని దర్యాప్తు చేస్తారా? సైబర్ క్రైమ్ పోలీసుల దర్యాప్తునకు సహకరిస్తారా? అనే అంశంపై స్పష్టత లేదు. ఈ ఏడాది జులైలో గుట్టురట్టు చేసిన భారీ స్కామ్‌ను సిటీ పోలీసులు సైతం లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. తమ వద్ద ఇన్వెస్ట్‌మెంట్‌కు ఆసక్తి చూపిన వారితో సైబర్ నేరగాళ్లు ప్రత్యేక యాప్ డౌన్‌లోడ్ చేయించారు. అందులో వారు పెట్టిన పెట్టుబడి, వచ్చిన లాభం, చేయాల్సిన టాస్క్ తదితరాలు కనిపిస్తుంటాయి. తొలినాళ్లలో లాభంగా వచ్చిన మొత్తం డ్రా చేసుకోవడానికీ అవకాశం ఇచ్చే నేరగాళ్లు భారీ మొత్తం ఇన్వెస్ట్ చేసేలా ప్రోత్సహిస్తారు. ఆపై డ్రా చేసుకోవడానికి ఆస్కారం లేకుండా మరికొంత పెడితేనే కుదురుతుందని సాఫ్ట్‌వేర్ చెప్తుంటుంది. ఇలా ఒక్కో బాధితుడితో రూ.లక్షల్లో పెట్టించిన తర్వాత ఆ యాప్ పని చేయడం మానేస్తుంది. దేశ వ్యాప్తంగా దాదాపు 15 వేల మంది రూ.712 కోట్లు ఈ ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌లో కోల్పోయారు. చైనీయులకు సంబంధించిన ఏజెంట్లు దుబాయ్‌లో ఉంటున్నారు. దేశంలోని వివిధ నగరాల్లో ఉన్న ఏజెంట్లు సైతం చైనీయుల ఆధీనంలోనే పని చేస్తున్నారు. బాధితుల నుంచి కాజేసిన మొత్తాన్ని దుబాయ్‌లోని పాత్రధారులు అమెరికన్ డాలర్లతో సమానమైన క్రిప్టో కరెన్సీగా మారుస్తున్నారు. ఆపై చైనాలోని సూత్రధారులకు వివిధ వాలెట్స్ ద్వారా నగదు పంపేస్తున్నారు. ఇలా వీరు వినియోగించిన మూడు వాలెట్స్‌లో హిజ్బుల్లా వాలెట్ కూడా ఉంది. ఇందులోకి దాదాపు 3 వేల డాలర్ల విలువైన క్రిప్టో కరెన్సీ బదిలీ అయింది. ఇక్కడ నుంచి ఆ నగదు ఎక్కడకు వెళ్లింది? ఎలా వెళ్లింది? తదితర అంశాలు దర్యాప్తు చేయడం నగర పోలీసులకు సాధ్యం కాదు. ఆ డేటా సంగ్రహించడమూ వీరి శక్తికి మించిన పనే. హిజ్బుల్లా వాలెట్ ఉగ్రవాదులకు నిధులు సమకూర్చడంలో కీలకపాత్ర పోషిస్తోంది. దీంతో అప్రమత్తమైన సైబర్ క్రైమ్ పోలీసులు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌తో (ఈడీ) పాటు ఎన్‌ఐఏకు సమాచారం ఇచ్చారు. నగర పోలీసులతో సమావేశమైన ఎన్‌ఐఏ అధికారులు కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకున్నారు. కేంద్ర ఏజెన్సీల సాయంతో హిజ్బుల్లా అంశాన్ని లోతుగా ఆరా తీయనున్నారు. ఈ దర్యాప్తులో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని నగర పోలీసు అధికారులు చెప్తున్నారు. అవసరమని భావిస్తే ఇన్వెస్ట్‌మెంట్ కేసులో అరెస్టు అయిన నిందితులను కస్టడీలోకి తీసుకుని విచారించే అవకాశం ఉందని వివరిస్తున్నారు.